క్లుప్తంగా

దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో గుండ్లచెరువు దుర్గా దేవి

గాలివీడు : మండల పరిధి గుండ్లచెరువు గ్రామం కస్బా పెద్ద చెరువులో వెలసిన దుర్గా దేవి ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు శనివారం ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా రెండు రోజుల నుంచి వేద పండితులచే పూజా కార్యక్రమాలు, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం, తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారు గ్రామోత్సవంలో భాగంగా గాండ్లపల్లె, గుండ్లచెరువు, రామిరెడ్డిగారిపల్లెలో ఇంటింటికి వెళ్లి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. ఆదివారం ఉదయం బోనాలు సమర్పించి, మొక్కులు గల భక్తులు జంతుబలులతో గ్రామోత్సవం ముగియనుంది.

నేడు సీతారాముల మినీ బ్రహ్మోత్సవం

చిన్నమండెం : మండల పరిధిలోని కదిరివాండ్లపల్లె గ్రామంలో వెలసియున్న శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామి ఆలయ 6వ వార్షిక మినీ బ్రహ్మోత్సవం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి కలశ పూజ, గణపతిపూజ, స్వస్తి పుణ్యాహవాచనం, ఆదిత్యాది నవగ్రహ ఆరాధన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. స్వామి వారికి పంచామృత అభిషేకం, విశేష అలంకరణ, ఎదురు కోళ్లు, తిరు కల్యాణ మహోత్సవం, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు జరుగునన్నారు. భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

27, 28న చిట్వేలిలో ఉరుసు

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలిలో వెలసి ఉన్న శ్రీహజరత్ జనాబ్ సయ్యద్ షా సాదక్ వలి ఉరుసు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి సయ్యద్ జిలానీ బాష హుస్సేని తెలిపారు. ఈ నెల 27వ తేదీన గంధం, 28న ఉరుసు మహోత్సవం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. హిందూ ముస్లింలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న సయ్యద్ జుల్ఫీకర్

నందలూరు : హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా చేసిన సేవలకు మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ అరవపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ జుల్ఫీకర్‌కు రాజమండ్రిలో 25వ తేదిన ఉదయం జరిగిన డాక్టరేట్ ప్రదానోత్సవ కార్యక్రమంలో డ్రెస్సింగ్ థియాలజీకల్ యూనివర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ జుల్ఫీకర్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవలతో ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్‌పీసీఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ తాళ్లూరి ప్రసన్న కుమార్, సౌత్ ఇండియా చైర్మన్ శ్రీకృష్ణ, హెచ్‌పీసీఐ చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు డాక్టర్ ఉమాదేవి, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు.

నివాళి



వేదమూర్తిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : గాలివీడు సింగల్‌విండో అధ్యక్షుడు వేదమూర్తిరెడ్డి మృతితో పెద్ద దిక్కును, ఆత్మీయుడిని కోల్పోయామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గాలివీడులో సింగిల్ విండో అధ్యక్షుడు వేదమూర్తిరెడ్డి దశదిన కర్మకాండ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సౌమ్యుడు, స్నేహశీలి వేదమూర్తిరెడ్డి ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుకు తెచ్చుకొని దిగ్భ్రాంతికి గురయ్యారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మెగా ఈవెంట్

కడప రూరల్ : కడప ప్రజలకు ఈ వేసవిలో ఆనందాన్ని అందించేందుకు ఈ నెల 26వ తేదీన ఆదివారం మెగా ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్ నిర్వహిస్తున్నామని డ్రీమ్ మీడియా ప్రతినిధి సుజాత, స్పార్క్ ఈవెంట్ ఆర్గనైజర్ అనీషలు తెలిపారు. వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కడప కన్వెన్షన్ సెంటర్‌లో సాయంత్రం 5 నుంచి 9 గంటల వరకు వినోద కార్యక్రమాలుంటాయన్నారు.

కమనీయం.. కల్యాణం

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో శ్రీ రేణుకా యల్లమాంబ కల్యాణం శనివారం సాయంత్రం వైభవోపేతంగా జరిగింది. జగజ్జననీ శ్రీ రేణుకా యల్లమాంబ సమేత జమదగ్ని మహర్షి ఉత్సవ మూర్తులకు గణపతిపూజ, పుణ్యాహవాచనం, యజ్ఞోప విధారణ, కంకణాధారణ, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, ముత్యాల తలంబ్రాలు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేదపండితులు రంగసముంద్ర మల్లికార్జునశర్మ, సుబ్రమణ్యం శర్మ, ప్రదీప్‌శర్మలు వేదమంత్రాల మధ్య మంగళ వాయిద్యాలతో అమ్మవారి కల్యాణం గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు. గ్రామ ప్రజలతోపాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి మూల విరాట్‌ను దర్శించుకొని కాయాకర్పూరాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారి కల్యాణం తిలకించారు.



కల్యాణోత్సవంలో రేణుకా యల్లమాంబ



అమ్మవారి కల్యాణం తిలకిస్తున్న భక్తులు

వైభవంగా సీతారాముల కల్యాణం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని సిద్ధవరం పంచాయతీ, దిగువ సిద్దవరం గ్రామంలో శనివారం రాత్రి సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామస్తుల కోరిక మేరకు స్థానిక సర్పంచ్ రాఘవరెడ్డి ప్రేమలతారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి దంపతులు ఈ కల్యాణం నిర్వహించారు. మేళతాళాలు, వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణం జరిగింది. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. దిగువ సిద్ధవరం గ్రామానికి చెందిన కె వెంకట్రామరాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కె.మల్లికార్జుననాయుడు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కల్యాణం వెంకటసుబ్బయ్యస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామమోహన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, శంకర్‌రెడ్డి, సీతారాముల ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



పెనగలూరు మండలం దిగువ సిద్దవరంలో సీతారాముల కల్యాణం

• అన్నదానం

పుల్లంపేట : సీతారాంపేట గ్రామంలో శనివారం పూజారి సత్యశర్మ ఆధ్వర్యంలో శ్రీపద్మావతి అమ్మవారు, భావనారుషి స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



స్వామి, అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

మాతమ్మా.. దీవించమ్మా..

ఏడు దశాబ్దాల తర్వాత జాతర

రాజంపేట రూరల్ : శ్రీమాతమ్మతల్లి జాతరను మన్నూరు రామలక్షుమ్మ, మన్నూరు నారాయణరెడ్డి చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఐ కేకే రెడ్డి సహాయ, సహాయకారాలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని పెద్దకారంపల్లిలో శ్రీమాతమ్మతల్లి జాతరను ఏడు దశాబ్దాల తర్వాత ఏడు రోజులు నిర్వహించనున్నారు. అందులో భాగంగా 3వ రోజు అయిన శనివారం మహిళా భక్తులు ప్రత్యేక పూజలు చేయటంతోపాటు పొంగళ్లు పొంగించారు. శ్రీమాతమ్మతల్లిని పసుపు, కుంకుమ, గాజులు, చీరతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించడంతో ప్రత్యేక శోభ వెల్లివిరిస్తోంది. ముందుగా పోతురాజు(దున్నపోతు)కు ప్రత్యేక పూజలు చేశారు. ఆసాదుల దీవెనల అనంతరం పోతలరాజు వెంట వస్తుండగా గ్రామాలలో ఊరేగింపు నిర్వహించారు. పెద్దకారంపల్లి పంచాయతీలో మహిళలు, ప్రజలు, భక్తులతోపాటు ఇతర రాష్ట్రాలలో ఉన్న వారు కూడా బంధు,మిత్ర సమేతంగా విచ్చేయడంతో అక్కడ భక్తి పారవశ్యం వెల్లివెరిసింది. జాతరకు సహకరించిన ఎస్ఆర్ఐ కేకే రెడ్డి కుటుంబీకుల సహాయం వెలకట్టలేనిదని పెద్దకారంపల్లి ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీమాతమ్మతల్లి



అమ్మవారికి విశేష పూజలు చేస్తున్న భక్తులు

వేడుకగా ఆర్యమాంబ జాతర





ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, అమ్మవారికి పాలు సమర్పించేందుకు ఊరేగింపుగా వస్తున్న భక్తులు

వీరబల్లె : మండల పరిధిలోని వంగిమళ్ల దిగువ రాచపల్లెలో వెలసిన శ్రీ ఆర్యమాంబ అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం అదే గ్రామానికి చెందిన యాదవులు అమ్మవారికి పాలు సమర్పించారు. ఈ పాలు సమర్పించే సమయంలో యాదవుల కులానికి చెందిన భక్తులు తప్పెట్లు, తాళాలతో వేడుకగా మెరవణిగా తీసుకొచ్చారు. అమ్మవారికి పాలు సమర్పించే వారు చెళకోళ్లతో ఒకరిని ఒకరు కొట్టుకొంటూ వచ్చారు. ఇదంతా తమ ఆచారమని వారు చెప్పడం విశేషం. అమ్మవారికి సమర్పించిన తరువాత ఆ పాలతోనే ప్రసాదం వండి భక్తులకు పంచిపెట్టారు. ఇలా చేయడం వల్ల భక్తులకు మేలు జరుగుతుందని వారి నమ్మకం. అలాగే ఈ వేడుకలో పాల్గొని అమ్మవారి ప్రసాదం స్వీకరిస్తే పిల్లలు పుట్టని వారికి పిల్లలు పుడతారని యువత విశేషంగా పాల్గొన్నారు. అమ్మవారికి పాలు సమర్పించిన తరువాత రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈవేడుకలు చూసేందుకు స్థానిక భక్తులతోపాటు ఇతర గ్రామ, ప్రాంతాలకు చెందిన వారు తరలి వచ్చారు.

కంబాలకుంటలో..



పెనగలూరు మండలం కంబాలకుంటలో గంగమ్మతల్లి మూలవిరాట్

పెనగలూరు (ఓబులవారిపల్లె) : కంబాలకుంట గ్రామంలో మూడు రోజుల నుంచి గంగమ్మ తల్లి జాతరను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో పార్టీలకు, కులమతాలకు అతీతంగా గ్రామమంతా ఈ గంగమ్మ జాతర నిర్వహిస్తున్నారు. ఆదివారం పొంగళ్ల కార్యక్రమం ఉంటుందని గంగమ్మతల్లి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ జాతరకు గ్రామమంతా విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్ల తిరునాల



భక్తులకు దర్శనమిస్తున్న కొత్తపురమ్మ తల్లి

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల కొత్త పురమ్మ, నారాయణరెడ్డిపల్లె శ్రీ పంచాలమ్మ, అన్నప్పగారిపల్లె పోలేరమ్మ తిరునాలలకు శనివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవార్ల మూలవిరాట్‌లకు వారు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి ముడుపులు తీర్చుకున్నారు. రాత్రి చాందినీ బండ్లతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



ఆలయం వద్ద సిద్దలు ఏర్పాటు చేసిన దృశ్యం

వీరాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

సంబేపల్లె : మండల పరిధిలోని గుట్టపల్లె సమీపంలో వెలసిన శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, చిదంబర్‌రెడ్డి, నిర్మలమ్మతో కలిసి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవీంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ పాల వెంకటరమణ, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

జీలుగలు, జనుము విత్తనాల పంపిణీ

సిద్దవటం : మండలంలోని టక్కోలి రైతు భరోసా కేంద్రం పరిధిలోని రైతులకు శనివారం 50 శాతం సబ్సిడీతో 60 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు, 10 క్వింటాళ్ల జనుము విత్తనాలను పంపిణీ చేశామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని టక్కోలి రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల పంపిణీ ప్రక్రియను నిశితంగా పరిశీలించామన్నారు. రైతు భరోసా కేంద్ర సహాయకులకు పలు సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. సుస్థిర భూసారానికి పచ్చిరొట్ట ఎరువులు ఎంతో దోహద పడతాయన్నారు. రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సమయాత్తం పై సమావేశాన్ని నిర్వహించామన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో సమీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్, నవధాన్య విత్తనాల సాగు, ఏటీఎం మోడల్, న్యూట్రీ గార్డెన్స్, కషాయాలు, ద్రావణాలు ఘన జీవామృతం తయారీ, వినియోగంపై చర్చించి ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రైతులను ప్రకృతి వ్యవసాయ విధానాలపై మొగ్గు చూపేలా చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలని సిబ్బందికి సూచించడం జరిగిందన్నారు. ప్రతి రైతు మొలక శాత నిర్ధారణ, విత్తన శుద్ధి తప్పనిసరిగా పాటించాలని, ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంబించాలని పేర్కొన్నారు. సాంకేతిక సలహాలు, ప్రభుత్వ పథకాలు పొందుటకు చక్కని వేదిక రైతు భరోసా కేంద్రం అన్నారు. కావున ప్రతి రైతు రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సహాయకులు వంశీ, శివ పణీంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సింగయ్య, చిన్నక్క, పల్లవి, సుమలత, షారోన్, వినిత, శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకుడు నాగరాజ

వైద్యాధికారిపై అసత్య ఆరోపణలు తగవు

సంబేపల్లె : సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డిపై చేస్తున్న అసత్య ఆరోపణలు తగవని సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆశావర్కర్లు అన్నారు.

శనివారం జిల్లా వైద్యాధికారి కొండయ్యకు వారు వినతిపత్రం అందజేశారు. వైద్యాధికారి విధుల విషయంలో కొద్దిపాటు మందలించడం తప్ప, ఇతర విషయాలలో జోక్యం చేసుకోరని వారు పేర్కొన్నారు. అంకిత భావంతో పని చేస్తున్న వైద్యునిపై కొంత మంది ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేయడం మంచిది కాదన్నారు.



వైద్యాధికారి కొండయ్యకు వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు

ఎట్టకేలకు వెలిగిన విద్యుత్ దీపాలు

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతంపల్లి పంచాయతీలో విద్యుత్ దీపాలు ఎట్టకేలకు వెలిగాయి. పంచాయతీ కార్యదర్శి శివశంకర్, ఈఓపీఆర్‌డీ పెంచలయ్యలు స్పందించడంతో విద్యుత్ కాంతులు వెదజల్లడంతో గ్రామం రాత్రి వేళలో విద్యుత్ కాంతులతో కళకళలాడుతోంది. గత కొన్ని రోజులుగా విద్యుత్ దీపాలు వెలుగక పోవడంతో రాత్రివేళల్లో ప్రజలు అటూ ఇటూ తిరగాలంటే ఎక్కడ విషపురుగుల కాటుకు బలవుతామోనని భయభ్రాంతులకు గురయ్యేవారు. అధికారులు స్పందించి మరమ్మతులు నిర్వహించడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.



అనంతంపల్లిలో విద్యుత్ కాంతులు

ప్రశాంతతకు విఘాతం కల్గిస్తే చర్యలు

చిట్వేలి : సమాజంలో ప్రశాంతతకు విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జ్ఞానేశ్వరి పేర్కొన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఈ నెల 25వ తేదీ నుంచి జూన్ 9 వరకు నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. ప్రైయివేటుగా పెట్రోల్ అమ్మకాలు చేయడం, బాణసంచా అమ్మడం, కాల్చడం, ఇంటిముందు, రోడ్డు పక్కన కంకర రాళ్లను నిల్వ ఉంచడం వంటి వాటిని నిషేధించామన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే అవకాశాలు ఉన్నట్లు అనుమానాలు ఉంటే తక్షణం తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. సమాజంలో ప్రశాంతత కొనసాగేందుకు అందరూ పరస్పరం సహకరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శేషంరాజు, సీనియర్ అసిస్టెంట్ రామసుబ్బారెడ్డి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

నందలూరు : సార్వత్రిక ఎన్నికల ఫలితాల సమయంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని ఎస్ఐ మహమ్మద్ అబ్జుల్ జహీర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు, రాజంపేట డీఎస్పీ చైతన్య ఆదేశాల మేరకు నందలూరు గ్రామ పంచాయతీలోని దాసరిగడ్డ, బెస్తవీధిలో బీఎస్ఎఫ్ (బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్) స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ జూన్ 6వ తేది వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు గానీ, టపాసులు పేల్చడం వంటివి చేయరాదని తెలిపారు. అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నందలూరు : ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

రౌడీ షీటర్లు ప్రవర్తన మార్చుకోవాలి

గాలివీడు : మండలంలోని రౌడీ షీటర్లు ప్రవర్తనను మార్చుకొని సమాజంలో విలువలు, అభిమానలను పెంపొందించుకోవాలని ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని అరవీడు గ్రామ యల్లంపల్లెలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ప్రతి రౌడీ షీటరు, గ్రామ బహిష్కరణకు గురైన వ్యక్తులు ఘర్షణలకు దూరంగా ఉండి ప్రశాంత వాతావరణాన్ని ప్రోత్సహించాలని కోరారు. ఎక్కడైనా గ్రామాల్లో ఘర్షణ వాతావరణం కనిపిస్తే వారిని ప్రధాన ముద్దాయిలుగా చేర్చడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కూడా గ్రామాల్లో ప్రశాంతంగా ఉంటూ, అందరి యోగక్షేమాలపై శ్రద్ధ వహించాలని కోరారు.



గాలివీడు : మాట్లాడుతున్న ఎస్ఐ వెంకటప్రసాద్

సిద్దవటం నుంచి ఓట్ల లెక్కింపు

- 14 టేబుల్స్ ఏర్పాటు
- 21 రౌండ్లు లెక్కింపు ప్రక్రియ
- పోస్టల్‌బ్యాలెట్ 3 ప్రత్యేక టేబుల్ ఏర్పాటు
- సాయిఇంజినీరింగ్ కళాశాల కేంద్రం

రాజంపేట : రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మొదటగా సిద్దవటం మండలం నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించనున్నారు. తర్వాత ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట రూరల్, రాజంపేట మున్సిపాలిటీ, వీరబల్లి, సుండుపల్లె మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో పోలైన ఓట్లు లెక్కించడం జరుగుతుంది. వచ్చేనెల 4న సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపును చేపట్టేందుకు ఇప్పటికే అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలో సిద్దవటం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట రూరల్, రాజంపేట మున్సిపాలిటీ, సుండుపల్లె, వీరబల్లి మండలాలు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 288 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 2, 41,200 మంది ఓటర్లు ఉన్నారు. పోలింగ్ శాతం 76.99 ఉంది. ఈ ఎన్నికల్లో 2211 మంది ఉద్యోగులు, అధికారులు పోస్టల్‌బ్యాలెట్ వినియోగించుకున్నారు.

21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ

రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేశారు. 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. 21 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహించనున్నారు. ప్రతి టేబుల్ వద్ద సహాయ రిటర్నింగ్ అధికారి, సూపర్‌వైజరు, మరొక సహాయకుడు ఉంటారు. కాగా పోస్టల్ బ్యాలెట్ కోసం 03 ప్రత్యేక టేబుల్ ఏర్పాటు చేశారు.



రాయచోటిలోని ఓట్ల లెక్కింపు కేంద్రం

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

జిల్లా ఎన్నికల అధికారి పర్యవేక్షణలో రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాలలో రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఉంటుంది. పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. 288 పోలింగ్ కేంద్రాలలో పోలైన ఓట్ల లెక్కింపు 21 రౌండ్ల వారీగా ఫలితాలు వెల్లడించడం జరుగుతుంది. లెక్కింపు కోసం14 టేబుల్స్‌ను ఏర్పాటు చేశాం. **-టి.మోహనరావు, రిట్నరింగ్ ఆఫీసర్, రాజంపేట**

